కథానిక

# చిన్నాన్న

డి. వాణి

సాయంత్రం అరవుతుంది. బీచ్ చాలా ఆహ్లాదకరంగా ఉంది. హస్తమించే సూర్యుని యెర్రని కాంతులు కెరటాలమీదపడిఎంతగాశోభిస్తున్నాయి. రకరకాల స్త్రీలు, పురుషులు, పిల్లలతో కలకలలాడుతోంది. ప్రజలశ్రమంతాచల్లగాలులతో తీరిపోతూంది అందరూ చాలాఉత్సాహంగా ఉన్నారు. అలాంటి సమయంలో, యే ఆనందాన్నీ అనుభవించలేకుండా విచారంగా కూర్చునాడు డాక్టర్ రామారావు. అతని మనస్సంతా బాధాపూరితంగా ఉంది. ఇంతలో "చిన్నాన్నా! చిన్నానా!"అన్న మృదు మధురకంఠస్వరం వినిపించింది. "చిన్నాన్నా!" తన సుగుణపాప పిలుస్తోందా? అతని హృదయం బాధగా మూలిగింది. ఎంతముద్దుగా పిలిచేది! ఆ రోజులెంత హాయిగా ఉండేవి! చిన్నారి సుగుణ తనకు దూరమైపోయింది! అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పూర్వస్మృతులన్నీ కళ్ళముందు తిరగసాగాయి.

* * *

రామారావుతండ్రి చంద్రశేఖరంగారు బాగా రాబడిఉన్న ప్లీడరు. అతనికిద్దరు కొడుకులు, ఒక కూతురు. రామారావు ఆఖరువాడు. చంద్రశేఖరంగారూ, భార్య సీతమ్మా ఛాందసులు. అతను చాల కోపిష్టి. పిల్లల కతనంటే చాలభయంగా ఉండేది. రామారావుకి పిల్లలంటే యిష్టం. చిన్నప్పుడు అక్క పిల్లలని నిముషం వదిలేవాడు కాడు.

రామారావు అన్న ప్రసాద్‌కి బొంబాయిలో ఉద్యోగమైంది. తనతో తమ్ముణ్ణికూడ తీసుకెళ్లాడు. అప్పటికి రామారావుకు పన్నెండేళ్ళుంటాయి. అన్నయ్య, వదినెలదగ్గరే చదువుకునేవాడు. రామారావు స్కూలుఫైనల్‌లోకి వచ్చేసరికి పదిహేనోయేడు వచ్చింది. ఆ యేడే ప్రసాద్‌కి కూతురు పుట్టింది. పాపకు 'సుగుణ' అని పేరు పెట్టారు. రామారావు పాపనొక్కక్షణం వదిలేవాడు కాడు. ఇంటిదగ్గర ఉన్నప్పుడల్లా పాపతో నేగడిపేవాడు. పాప రోజురోజుకీ పెరుగుతూ క్రమంగా తప్పటడుగులువేస్తూ ఉంటే అతను తన్మయుడయేవాడు. అతనికి స్నేహితులే అక్కర్లేకపోయేవారు. సెలవులకి ఊరికి వెళ్ళడమంటే అతనికెంతో బాధగా ఉండేది.

రామారావు స్కూలుఫైనల్ ప్యాసయి యింటర్‌లో చేరాడు. పాపకు మూడో యేడు వచ్చింది. అతను చదువుకుంటూంటే ముద్దుగావచ్చి నిశ్శబ్దంగా కూర్చునేది. కాలేజీనించి రాగానే, "చిన్నాన్నా! చిన్నాన్నా!" అంటూ కాళ్ళకు చుట్టుకునేది. పాపనెత్తుకుని షికారుగా వెళ్లేవాడు. అందరూ "సుగుణా" అని పిలిచినా అతను మాత్రం 'పాపా' అనేవాడు. ఒక్కొక్కప్పుడు పాపవచ్చి భుజాలమీద నించి చేతులేసి ముఖంలో ముఖంపెట్టి అల్లరిగా 'చిన్నాన్నా!' అంటే అతనికెంతో ఉత్సాహంకలిగేది. ఆడుతూనే పరీక్షలకి చదివేవాడు.

అతను యింటర్ పూర్తిచేసి యం. బి. బి. యస్‌లో చేరాడు. పాపను అప్పుడప్పుడు స్నేహితుల యిళ్ళకి తీసుకెళ్ళేవాడు. "పిల్లలంటే అంత యిష్టమేమిటోయ్?" అని నవ్వేవారు ఫ్రెండ్సు; ఆశ్చర్యపడేవారు.

* * *

పాపకు ఐదోయేడు వచ్చింది. బడిలో వేశారు. చిన్నాన్నే అన్నీ చెప్పేవాడు పాపకు.

ఆ రోజు దీపావళి. పాప ఉదయాన్నే లేచి నీళ్ళుపోసుకుని కొత్తబట్టలు కట్టుకుంది. రామారావు పడుక్కుంటే. "లే చిన్నాన్నా!" అని లేపింది. అతనికి ముందురోజు రాత్రినించి జ్వరంగా ఉంది. కొంచెంసేపు పిలిచేసరికి చికాకువేసి, "ఇక్కడనుంచి వెళ్ళుపాపా!" అన్నాడు. ఎప్పుడూ కసరని చిన్నాన్న అలా అనేసరికి పాపకు దుఃఖం వచ్చింది. గబగబా వెళ్ళిపోయింది. ఆ రోజంతా రామారావు జ్వరంతో లేవలేదు. సాయంత్రానికి కాస్తతగ్గింది. పాప యెక్కడా కనబడలేదు. ప్రొద్దున కసిరినసంగతి గుర్తొచ్చింది. పాప

మీాదెంతో జాలివేసింది. లేచి వెళ్ళేసరికి పాప బాల్కనీలో నిల్చుని దిగులుగా యెటో చూస్తూంది. ఒక్కసారి రామారావు పాపనెత్తుకుని, "చిన్నాన్న మీాద కోపంవచ్చిందా పాపా" అన్నాడు. 'లేదు చిన్నాన్నా!" అని అమాయకంగా నవ్వింది. అతను ఒంట్లో బాధంతా మరచిపోయాడు.

* * *

రామారావు క్లాస్ మేట్ సుశీల. మహారాష్ట్రుల అమ్మాయి. ఇద్దరూ చాల స్నేహంగా ఉండేవారు. సుశీల అప్పుడప్పుడు రామారావు యింటికివచ్చేది. పాపంటే ఆమెకుకూడ చాలయిష్టం కలిగింది. రామారావుకి సుశీలను వివాహం చేసుకోవాలని ఉండేది. కాని, తల్లిదండ్రుల ఛాందసం తలుచుకుని వూరుకొనేవాడు.

పాపకు తొమ్మిదో యేడువచ్చింది. రామారావు యం. బి. బి. యస్. ఫస్టుగా ప్యాసయాడు. హాస్పిటల్ లో ఒక యేడాది పనిచేసి కొంత అనుభవం సంపాదించాడు. ఇంకా చదవడానికి ఫారిన్ వెళ్ళాలని అభిలషించాడు. "నువ్వు ఇంగ్లండు వెళితే నన్ను కూడ తీసుకెళ్తావుకదూ చిన్నాన్నా!" అనేది పాప. 'నిన్నువదిలి నేనుండగలనా?' అనేవాడు రామారావు నవ్వుతూ.

సుశీల తల్లిదండ్రులకు కూడ రామారావంటే యిష్టం కలిగింది. నవీన పద్ధతు లవలంబించడంచేత, సుశీల ఒక్కర్తే కావడం చేత ఆమె యిష్టప్రకారంగా రామారావును చేసుకుందుకి అంగీకరించారు. అతను ఫారిన్ వెళ్ళేలోగా వివాహం కావాలన్నారు.

చంద్రశేఖరంగారు మొదట కొడుకు ఫారిన్ వెళ్తానంటే అంగీకరించలేదు. కాని అతని పట్టుదలచూసి ఒప్పుకున్నారు. రామారావుని అడగకుండానే ఒక సంపన్న కుటుంబంలో అమ్మాయిని అతనికివ్వడానికి నిశ్చయం చేశారు. పెళ్ళి విషయాలు, కొడుకు ప్రయాణం సంగతి మాట్లాడదామని భార్యతోకూడా బొంబాయి వచ్చారు.

ఆ రోజు భోజనాలు ముగించి తాంబూలాలు వేసుకుంటున్నారు. చంద్రశేఖరంగారు 'రామం, పెళ్ళిఅయేక నువ్వు వెళ్లోచ్చు,' అన్నారు. రామారావేమీా మాట్లాడలేదు. అతనే మళ్ళా, 'నీకు డాక్టర్ సుబ్బారావుగారి అమ్మాయిని నిశ్చయం చేశాం. నీ ప్రయాణం సంగతి కనుక్కొని వెళ్ళి ముహూర్తం స్థిరపరుద్దామనే వచ్చాను."

'అదేమిటినాన్నా! నాయిష్టం లేకుండా యెలా నిశ్చయం చేశారు?' అన్నాడు ఆశ్చర్యంగా.

"నీయిష్టం యేమిటి? పెద్దవాళ్ళం ఉండగా, మాది కాకపోతే యింకెవరిదీ బాధ్యత?" అన్నారు.

"బాధ్యత యెవరిదైనా చేసుకునే వాళ్ళ యిష్టం ఆలోచించవద్దా?" అన్నాడు రామారావు. అతని పెళ్ళివిషయం మాట్లాడుతున్నారని తెలిసిన పాప రామారావు పుస్తకంలోంచి సుశీల ఫొటో తీసి పట్టుకొచ్చి, "ఈ పెళ్ళికూతురు బాగుంది కదూ తాతా!" అని అతనికిచ్చింది. రామారావుకెంతో భయంవేసింది. పాపనేమీా అనలేక ఊరుకున్నాడు అంతా ఆశ్చర్యపోయారు.

"ఇదేమిటి? ఈబుద్ధు లెప్పటినుంచి?" అన్నారు చంద్రశేఖరంగారు కోపంగా.

"నేనాఅమ్మాయిని చేసుకుందామనుకుంటున్నా!" అన్నాడెలాగో ధైర్యంచేసి.

"వాళ్ళు మనవాళ్లేనా?" అని అడిగారు.

"వాళ్లు మహారాష్ట్రులు, కాని వాళ్ళ సాంప్రదాయం చాలమంచిది," అన్నాడు.

"నువ్వా అమ్మాయిని చేసుకోవడం నిశ్చయమే అంటావా?" అన్నది సీతమ్మ.

"నిశ్చయమే," అన్నాడు. చంద్రశేఖరంగారికీ మాటతో చాలకోపం వచ్చింది. "ఏదో చదువుకుంటావని పంపిస్తే యిష్టమొచ్చిన రీతిగా ప్రవర్తిస్తావా? సాంప్రదాయం, కులం, గౌరవం అన్నీ మర్చిపోయి మహారాష్ట్రుల అమ్మాయి చేసుకుంటావా? మనలో యెవరైనా అలా చేశారా? ఇంత చదువు చదివి యిదేనా నీబుద్ధి? మనిషైం తరువాత ఆలోచన ఉండక్కరలేదూ? ఈ పెళ్ళి చేసుకుంటే నువ్వన్నివిధాలా చెడిపోతావు", అన్నారు. రామారావు యేమీా మాట్లాడలేదు. మళ్ళా ఆయనే, "నామాటవింటే యేమైనా బాగుపడతావు. నువ్వామ్మాయిని చేసుకుందికి వీల్లేదు. అయినా యీప్రేమా, వ్యవహారం యెన్నాళ్ళులే!" అన్నారు. అతని చివరిమాటల్లో హేళన ధ్వనిస్తూంది. రామారావు మనస్సు చివుక్కుమంది. ఎంతో గౌరవంతోను, అణుకువగాను ఉంటూ, తనను ప్రాణసమానంగా చూసే సుశీల ప్రేమ

అబద్ధమా? భాషలు వేరైనంతమాత్రాన మనుష్యుల హృదయాలు మంచివిగా ఉండవూ? తనకి చదువుకి పెట్టినడబ్బు కట్నం రూపంలో రాబట్టడానికి తండ్రి ఎత్తువేశారని అతనికి సులువుగా అర్థమైంది.

"డబ్బుకీ, మనుష్యులకీ సాటేమిటి నాన్నా! మంచివాళ్లు, సుఖపెట్టేవాళ్లు కావాలికాని కట్నం కోసం ఆశించడం మంచిదంటావా? మనవాళ్లు కానంతమాత్రాన చెడ్డవాళ్ళవుతారా?" అన్నాడు.

"సంతోషించాంలేవోయ్. నాకు నీతులు నేర్పుతున్నావేం? నువ్వు నామాట వినకపోతే నీకు ఆస్తి ఏమాత్రం దక్కదు. నీకూ నాకూ యేవిధమైన సంబంధంలేదు. నన్ను గౌరవించనివాడు నా కొడుకెలా అవుతాడు?" అన్నారు కోపంతో. అంతవరకు బాధపడే రామారావుకి ఆ మాటతో కోపంవచ్చింది. "డబ్బుకీ అభిమానాలకీ ముడిపెట్టే మీతో నేనెంత మాత్రంవుండను. నా చదువు కేవిధమైన ఆటంకం లేకుండా చూసుకునే సమర్థత నాకుంది. పెళ్ళివిషయంలోకూడ నా యిష్టం సాగనివ్వకుండా మీరు ప్రయత్నిస్తున్నారు. కాని నాకు ఆమాత్రం తెలివితేటలున్నాయి. నే నాలోచించకుండా చెయ్యడంలేదు. డబ్బు కారణంగా 'సాంప్రదాయం' అనే పేరుతో నన్ను వేరు చేసుకుంటున్నారని గ్రహించండి" అని గబగబా తన రూమ్‌లోకి వెళ్లాడు. సీతమ్మ దిగులుగా ఉండిపోయింది. చంద్రశేఖరంగారు చలించలేదు. 'చిన్నాన్నని యీ అమ్మాయినే చేసుకోనియ్యండి తాతా!' అన్నది పాప.

'నీకెందుకే పెద్దకబుర్లు నీ బుద్ధులూఅలాంటివే!' అని ఒక్కదెబ్బ వేశాడు ప్రసాద్. పాపకు దుఃఖం వచ్చింది. అప్పుడే డ్రెస్సులేసుకుని వెళ్లే రామారావునిచూచి అతని వెంటపడింది.

"నువ్వు నామాట వినవన్నమాట" అన్నారు చంద్రశేఖరంగారు.

"మంచిదని నాకు తెలిసే ఆ అమ్మాయిని చేసుకుంటున్నా" అని గబగబా మెట్లు దిగాడు. పాప వైపు చూడలేదు. మెట్లన్నీదిగి వెనక్కుతిరిగి చూశాడు. పాపదీనంగా నిల్చుని ఉన్నది. 'పాపా' అంటూ మెట్లెక్కాడు. "చిన్నాన్నా! చిన్నాన్నా!" అంటూవచ్చి అతనిచేతుల్లో వాలిపోయింది "నువ్వు వెళ్ళొద్దు చిన్నాన్నా!" అంటూ యేడవ నారంభించింది. అతనికి కూడ కళ్ళలో నీళ్లు తిరిగాయి. తమరిద్దరికీ ఉండేబాంధవ్యం యేమిటి? తల్లిదండ్రులకన్నా పాప మనస్సెంతో బాధపడుతోంది! పాప పసిహృదయం యెంత నిష్కల్మషంగా ఉంది! "ఏడవకు పాపా! వెళ్ళొస్తా!" అని వెళ్ళిపోయాడు. మేడమీద నించి యిదంతా చూస్తున్న సీతమ్మ మనస్సు కరిగిపోయింది. భర్తకి భయపడి దుఃఖాన్ని అణచుకుంది — అమాయకురాలు.

* * *

రామారావు మరి యింటికిరాలేదు. సీతమ్మ యెంతో యేడ్చింది. భర్తనెలాగో బ్రతిమాలింది. కాని అతను చలించలేదు. గుండె రాయిచేసుకుని ఊరుకుంది. ఇద్దరూ ఊరికి వెళ్ళిపోయారు.

రామారావు ఫ్రెండ్సుతో ఆలోచించాడు. అంతా అతని అభిప్రాయంతో యేకీభవించారు. సుశీల తల్లిదండ్రులు మొదట విషయం తెలిసి జంకినా చివరకు ఒప్పుకున్నారు. ఇద్దరికీ వివాహం జరిగిపోయింది. శుభలేఖపంపినా ప్రసాద్ రాలేదు. రామారావుకి కష్టంవేసింది. అతని ఇంగ్లండుప్రయాణానికి యేర్పాట్లు జరిగాయి.

ఆ రోజే అతని ఇంగ్లండ్ ప్రయాణం. పాపను చూడాలనిపించింది. కాని వాళ్ళయింటికి వెళ్ళడానికి అభిమానం అడ్డింది. స్నేహితులంతా వీడ్కోలివ్వడానికి వచ్చారు. ఫొటోలు తీశారు. కాని అతని మనస్సంతా పాపమీదే ఉంది. "నువ్వు వెళ్ళొద్దు చిన్నాన్నా!" అన్నమాటలు పదేపదే చెవుల్లో ధ్వనించసాగాయి. తల్లివిగ్రహం కళ్ళముందు మెరిసింది, తల్లిని చూడాలనిపించింది, ఉత్సాహం అంతాపోయి మనస్సంతా వికలమై పోయింది. షిప్ బయల్దేరింది. సుశీల భర్తవేపు చూస్తూ ఆనందంతోనూ, వెళుతున్నాడన్న విచారంతోనూ చేయి ఊపింది. అతనికి ఒకటే మాట వినిపిస్తోంది. అదే 'చిన్నాన్నా చిన్నాన్నా' ఒకే విగ్రహం కళ్లముందు కనపడతోంది. అదే పాప!

* * *

చంద్రశేఖరంగారు యేమంత బాధపడలేదు. తన మాట తిరస్కరించాడన్నకోపం అతనిలో ఉండిపోయింది. సీతమ్మకు యెప్పుడూ రామారావే

గుర్తొచ్చేవాడు. ఎటూ మాట్లాడలేక పోయేవాడు ప్రసాద్, పాపమాత్రం చిన్నాన్నని మర్చిపోలేదు.

ఏడేళ్ళుగడిచాయి. పాప పెద్దదైంది. పధ్నాలుగో యేడువచ్చింది. తల్లిదండ్రులతో యెక్కడికైనా వెళ్లేటప్పుడు డాక్టర్ సుశీల కనబడేది. పలకరిద్దామనుకున్నా ప్రసాద్‌కి భయపడేది.

ఒకరోజు పాప పేపర్ చదువుతూంది. రామారావు ఫోటో, అతని చదువు వివరాలు, స్వదేశీశాకి వచ్చినట్టు పడ్డాయి. పాప ఆనందానికి మేరలేదు. చిన్నాన్న! తన చిన్నాన్నే చక్కగా ఇంగ్లండు వెళ్ళివచ్చాడు. తమ యింటికి రాలేదేమో? తనని మరచిపోలేదుకదా! పాపకు ఆనందం, దుఃఖం కూడా కలిగాయి.

రామారావు, సుశీలా కలసి ప్రాక్టీసుపెట్టారు. కీర్తి, లక్ష్మీకూడా అతన్ని వరించాయి. అన్నగారింటికి వెళదామని అనుకునేవాడు. కాని జరిగినవన్నీ గుర్తొచ్చేవి. ఎంతో బాధపడేవాడు.

రామారావుకెప్పుడూ తీరికే ఉండేదికాదు. ఎప్పుడైనా కాస్త లభిస్తే సుశీలతో గడిపేవాడు. అతని మాటలు పాపని గురించే.

ఒకసారి ఆదివారం సుశీల ఫిలిమ్‌ప్రోగ్రాం వేసింది. రామారావుకానాడు కాస్త తీరిక దొరికింది. ఇద్దరూవెళ్ళారు. కాని అతని దృష్టి సినిమామీద లేదు. ఆనాడంతా పాప గుర్తురాసాగింది. ఇంటర్వెల్లులో దీపాలు వెలిగాయి. సుశీలతో మాట్లాడుతూ అటూ యిటూ చూస్తున్నాడు. వెనకసీటులో సుమారు పదిహేనేళ్ళమ్మాయి కనిపించింది. అన్నీ పాప పోలికలే. పాప కాదుకదా! అనుకున్నాడు. పదేపదే ఆ అమ్మాయిని చూడనారంభించాడు

పాప ఆనాడు తల్లిదండ్రులతో ఫిలింకివచ్చింది. రామారావుని చూసింది. నిరంతరం అతన్నే తలుస్తూన్న పాప ఇంక ఆగలేకపోయింది. సీట్‌లోంచి లేచి రాబోతూంది; రామారావు కూడా యింక ఉత్కంఠ ఆపుకోలేక గబగబావచ్చాడు. మధ్యలో ఇద్దరూ ఆగిపోయారు. పాప మాట్లాడలేకపోయింది.

"నీ చిన్నాన్నని మర్చిపోయావా పాపా?" అన్నాడు రామారావు గాద్గదికంగా. పాప కళ్ళలో నీళ్ళుతిరిగాయి. "నిన్ను మర్చిపోతానా చిన్నాన్నా" అన్నది. చిన్నాన్న! ఎన్నాళ్ళకు విన్నాడు తను! తనను పాప మళ్లా అలా పిలుస్తుందని అనుకోలేదు. ఇంకా అతనేదో మాట్లాడబోతున్నాడు-ఇంతలో, "ఇలా రావేం సుగుణా?"అని ప్రసాద్ కటువుగా పిలిచాడు. "ఇంటికి రా చిన్నాన్నా!"అని పాప వెళ్ళిపోయింది. రామారావు తన సీట్‌కి వెళ్ళిపోయాడు. ఇదంతా చూసిన సుశీల దీనంతటికి తనే కారణమని బాధపడింది. కాని తనేంచేయగలదు? రామారావు మాటిమాటికి పాపవైపే చూడసాగాడు. అన్నకూడా పూర్తిగా మారిపోయాడని అతను తెలుసుకున్నాడు.

సినిమా పూర్తయింది బయటికివచ్చేశారు. పాప రామారావువెనకాలే మెట్లుదిగినా ఏమీ మాట్లాడలేకపోయింది. తల్లిదండ్రులతో కారెక్కింది. కారు వెళ్ళిపోయేవరకు బాధగాచూసి తనకారెక్కాడు రామారావు.

పాపకు చిన్నాన్నే జ్ఞాపకం రాసాగాడు. చిన్నాన్న! చిన్నప్పుడు తననెంతో ముద్దుగా చూశాడు. తననెప్పుడూ వదిలేవాడు కాడు. ఇప్పుడు తనతో మాట్లాడటానికే వీల్లేకపోయింది. తండ్రికూడా మారిపోయాడు. చిన్నాన్న యేం తప్పు చేశాడని వీళ్ళంతా ద్వేషిస్తున్నారు? సుశీల యెంత మంచిది! పాప అలాగే అనుకుంటూ రాత్రంతా నిద్రపోకుండానే గడిపింది.

పాప ఆ రోజు స్కూల్‌నుంచి వచ్చింది. సాయంత్రం కొంచం జ్వరం వచ్చింది. చంద్రశేఖరంగారు, సీతమ్మ అక్కడే ఉన్నారు. చిన్నాన్నని చూడాలని ఉందని చెప్పింది; ఎంతో ఏడ్చింది కాని, శేఖరంగారి కఠినహృదయం చిన్నాన్న పాపల బాంధవ్యాన్ని అర్థంచేసుకోలేదు. పేరెత్తడానికి వీల్లేదన్నారు. పాప లేతహృదయం గాయపడింది. బెంగపెట్టుకొంచె. జ్వరం ఎక్కువైంది. పాపనోట్లోంచి ఒకే మాట వచ్చేది 'చిన్నాన్న! చిన్నాన్న!' మందు లిప్పించారు. కాని మనోవేదన నెవరు తీరుస్తారు? ఆ పాప హృదయాన్నెవరూ అర్థం చేసుకోలేదు. 'నువ్వు వెళ్ళొద్దు చిన్నాన్నా! నన్ను మర్చిపోతావా చిన్నాన్నా? రావా?' అని పలుకరించడం ప్రారంభించింది. వారం రోజులకి పూర్తిగా విషమించింది. ఆ పలవరింతలకి ప్రసాద్ హృదయం కరిగి పోయింది. వెంటనే రామారావు దగ్గరికి వెళ్ళాడు. నీ సుగు

నాను బ్రతికించు తమ్ముడూ! అని అతని చేతులు పట్టుకుని కన్నీళ్ళు కార్చాడు. రామారావు యిక ఆగలేకపోయాడు. "పాపా! పాపా!" అని పిలుస్తూ వచ్చి మంచంమీద కూర్చుని తలనిమిరాడు. పాప కళ్లు తెరిచింది. "చిన్నానా్న! వచ్చావా చిన్నానా్న?" అన్నది. తెలివి తప్పిపోయింది. రామారా వెన్నో మందులు పోశాడు.

"మర్చిపోకు చిన్నానా్న! మన నెవ్వరూ వేరు చెయ్యలేరు చిన్నానా్న! చిన్నానా్న!" అంటూ అతని ఒడిలో వాలిపోయింది. పాప జీవితం ముగిసింది. "పాపా" అని ఏడ్చాడు రామారావు.

చంద్రశేఖరంగారి కిప్పుడన్నీ అర్థమయ్యాయి. తన చేతులారా చేశానని అతనికి బాధకలిగింది. కాని సమయం మించిపోయింది.

"మీ పగ తీరిందనుకుంటాను నాన్నా! నేనేదో దుష్కార్యం చేస్తున్నానని పాపనించీ, మీనించి వేరుచేశారు. 'చిన్నానా్న!' అని నోటితో పిలవడానికికూడా వీల్లేదన్నారు. మన ద్వేషాలకు పాపబలైంది. అన్నయ్యను అన్నివిధాలా అన్యాయం చేశాం. ఒక్కకూతురు! ప్రాణంతో సమానంగా పెంచుకున్నారు. ఇదంతా మీరు ఆలోచించే చేశారా? కాని మీరెన్ని చేసినా, పాప శారీరకంగా దూరమైపోయినా నా హృదయంలో నిలిచే ఉంటుంది" అన్నాడు రామారావు ఉద్రేకంగా. బరుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. బీచ్‌లో కూర్చున్నాడు. అతని మనస్సంతా వేదనాపూరితమైపోయింది.

* * *

రామారావలా కూర్చుండి పోయాడు. కళ్ళలోంచి నీళ్ళు కారిపోతున్నాయి. ఇంతలో మళ్ళా "చిన్నానా్న!" అన్న పిలుపు వినబడింది. అప్రయత్నంగా వెనక్కు తిరిగాడు. అయిదేళ్ళపాప యిసుకలో ఆడుతూ చిన్నాన్నని పిలుస్తోంది. ఆ పాపలో సుగుణ మెరిసింది. గబగబా వెళ్ళి యెత్తుకుని 'చిన్నానా్న అనమ్మా!' అన్నాడు. పాప తెల్లబోయి దిగబోయింది. పాపతో ఆడే యువకుడతన్ని చూచి యేదో బాధపడుతున్నాడని గ్రహించాడు. 'చిన్నానా్న అని పిలు పాపా!' అన్నాడు. పాప ఆశ్చర్యంగా రామారావువేపు చూసి 'చిన్నానా్న!' అన్నది. 'ఒక్కసారి, ఒక్కసారే' అని మళ్ళా అనిపించి పాపను ముద్దుపెట్టుకుని దింపాడు. ఆ పాప వెళ్ళిపోయింది...

---

స్కెచ్

# కోర్టు పక్షి

"పారిజాత"

కోర్టు వ్యవహారాలంటే-శంకరానికి మంచి సరదా. ప్రతిరోజూ ఏదోపని కల్పించుకొని కోర్టు చుట్టూ తిరిగి రావడం అతని దినచర్య. ఈ విషయంలో తండ్రీ కొడుకులకు తీవ్రంగా అభిప్రాయ భేదాలు కల్గుతూండేవి. శంకరానికి-ఒక కూతురు-ఒక కొడుకు-కూతురుకు యింకా పెళ్ళిచేయలేదు. సుబ్బారావుకు మాత్రం ఎల్లాగో చెయ్యగలిగాడు.

లక్ష్మి వివాహ విషయంలోనూ పంట వసూళ్ల విషయంలోనూ, గ్రామంల్లో తగవుల విషయంలోనూ తండ్రీకొడుకులు తగాదా పడేవారు.

శంకరం చెప్పుకోతగ్గ వ్యవహర్త. అంటే, వ్యవహారం సులభంగా పరిష్కారం కాకపోయినా తాడో పేడో తేలేవరకూ కోర్టులు విడచిపెట్టడు, దానికోసం ఎంత ఖర్చుజరిగినా లక్ష్యపెట్టడు. గ్రామంలోని వ్యవహారము లన్నిటికీ తనని అడక్కపోయినా—తోచినవిధంగా సలహాయిచ్చి వీలైతే కోర్టువరకూ సాగనంపే అలవాటు శంకరానికి.

పిల్లవివాహంలో ఏమాత్రం శ్రద్ధవహించినా సులువుగా జరిగిపోయేది. దానికోసం సవాలక్షకోరికలు పెట్టుకొని పిల్లవయస్సు ముదిరి వ్యవహారం సాంతం చెడేదాకా తెచ్చి పెట్టుకొన్నాడు.